క్లుప్తంగా

సీఎం సభాస్థలిని పరిశీలించిన రవిచంద్ర


గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఇల్లెందు: నవంబర్ 1న ఇల్లెందులో జరగనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభ కోసం రెండు ప్రదేశాలలో స్థలాలను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సందర్శించి పరిశీలించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్‌లతో కలిసి లలితాపురం, బొజ్జాయిగూడెంలలోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. రవిచంద్ర మాట్లాడుతూ.. సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్, టీబీజీకేఎస్ నాయకుడు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభకు తరలిరండి

కొత్తగూడెంఅర్బన్: వచ్చేనెల 5న సీఎం కేసీఆర్ జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నిర్వహించనున్న బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ కోరారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో గురువారం మహిళలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చుంచుపల్లి: మండలంలో పలు సెక్టార్లలోని పోలింగ్ కేంద్రాలలో చేస్తున్న ఏర్పాట్లు, వసతులను ఎంపీఓ గుంటి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. 208, 209, 210, 211, 213, 214, 227, 228,229 వంటి 9 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వసతులపై పంచాయతీ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో లైటింగ్, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు, ర్యాంపులు, టాయిలెట్లు, రన్నింగ్ వాటర్ పరిసరాల పరిశుభ్రత అన్నింటినీ పరిశీలించారు. ఇతర మరమ్మతు పనులు ఉంటే వెంటనే చేపట్టాలని సూచించారు.

పాల్వంచరూరల్: మండలంలోని 33 పోలింగ్ స్టేషన్లను గురువారం నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎంపీడీఓ బి.అప్పారావు పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో వ్యక్తిగత మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, ర్యాంప్‌లను పరిశీలించారు.

మళ్లీ 'హరీ'తహారం


ఎండిపోయిన హరితహారం మొక్కలు

సుజాతనగర్: హరితహారంలో భాగంగా ఆగస్టు 26న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నాటిన మొక్కలన్నీ వంద శాతం ఎండిపోయాయి. కోటి వృక్షార్చనలో భాగంగా ఈ మొక్కలు నాటారు. మొక్కలు నాటినప్పటి నుంచి నీళ్లు పోసే వారు కరువయ్యారు. మొక్కల సంరక్షణ గాలికొదిలేయడంతో అవన్నీ ఎండిపోయాయి. గత ఏడాది కూడా పాఠశాలలో మొక్కలు నాటారు. అప్పుడు కూడా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. వాటి స్థానంలో రెండోసారి నాటిన మొక్కలు కూడా ఎండిపోయాయి. సంరక్షణ చేసే పరిస్థితి లేనప్పుడు మొక్కలు నాటడం ఎందుకు..? ఎమ్మెల్యే గారూ.. ఇదేం పని తీరు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నేడు బతుకమ్మ వేడుకలను జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కార్పొరేట్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న ప్రధాన బతుకమ్మ వేడుకలను జయప్రదం చేయాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. తెలంగాణలో అతిపెద్ద పండుగ బతుకమ్మని అని, ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వరరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. కొత్తగూడెం పట్టణ ప్రాంత మహిళలు ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజవయంతం చేయాలని కోరారు. ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

చీడ పీడలతో రైతుల ఆందోళన

ఇల్లెందు: పంట చేతికొచ్చే సమయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. టేకులపల్లి మండలం కుంటల్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు జూలైలో పాల్వంచ నుంచి వరి విత్తనాలు తెచ్చి సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయానికి పైరుకు పురుగు పట్టింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, ఏఈఓ శ్రావణి గురువారం ఆయా వరి పంటలను పరిశీలించారు. విత్తనాల్లోనే తేడా ఉందని తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వానర కష్టాలు.. తప్పించేదెవరు?

పగలూ రాత్రి యాడ జూసినా వానరాలే
చెట్టు, చేమ ఏదీ దక్కనీయడం లేదు
ఇళ్లు గుల్ల చేసి గాయపరుస్తున్నాయి
ఎవరికి పట్టేను సామాన్యుడి ఇబ్బందులు
ఎన్నికల ప్రచారాల్లో
హామీలు బోలెడు
నవంబర్ 30 దాటితే..
నేత.. చిక్కడు దొరకడు
నిలదీసే తరుణమిదే
జనగళం జోరిప్పుడే
చేయి దాటిందా ఓటు
ఎవరికీ చెవికెక్కదు గోడు


తిలక్‌నగర్‌లో ఓ వీధిలో కోతుల గుంపు

కోతుల బెడదతో బెంబేలు
- పంటలు, కూరగాయలు.. ఏవీ దక్కడం లేదు
- బయటకెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని నాయకులు, అధికారులు

ఇల్లెందురూరల్: కొండలు.. గుట్టలు.. చెట్లు.. చేమలపై కనిపించే వానరాలు నేడు నిత్యం జనావాసాల్లో సంచరిస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. ఏ తోటలనూ దక్కనివ్వడం లేదు. ఇంటి పెరడులో కూరగాయల మొక్కలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. ఇలా పగలూ.. రాత్రి తేడా లేకుండా పల్లెల్లో వానర సైన్యం ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. వానరాల వల్ల నిత్యం ప్రజలు ఇంత ఇబ్బంది పడుతున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. తమకంటూ ఒకరోజు వస్తుందని భావించి ఇంతకాలం ఓపికగా నిరీక్షించిన ప్రజలు ఓట్ల పండుగ జరుగుతున్న ఈ సమయంలో వానర కష్టాలపై నేతలను ప్రశ్నించేందుకు ఎదురుచూస్తున్నారు.

కాగితాలకే పరిమితమైన నియంత్రణ...

అడవులు అంతర్ధానంతో వనరాలు ఊళ్లపై పడుతున్నాయి. జనాభా పెరుగుదలతో కొండలు గుట్టలను తొలిచేస్తున్నారు. దీంతో అటవీ జంతువులు ఆవాసాలు కోల్పోయి జనావాసాల్లోకి వస్తున్నాయి. ఊరూరా వానర సైన్యం క్రమంగా పెరిగిపోయి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడటంతోపాటు ఇళ్లలోకి చొరబడి బీభత్సం చేస్తున్నాయి. పండ్ల తోటలు, చేలను నాశనం చేస్తున్నాయి. తలుపు తెరిచి ఉంటే చాలు ఇంట్లోకి జొరబడి తినుబండారాలను ఎత్తుకెళుతున్నాయి. గృహోపకరణాలను ధ్వంసం చేస్తున్నాయి. ఆ సమయంలో అడ్డగించే ప్రయత్నం చేస్తే మనుషులపై దాడి చేస్తున్నాయి. ఇలా అన్ని రంగాలపై ప్రభావం చూపుతున్న కోతుల సంతతి పెరగకుండా.. వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించడం ద్వారా నియంత్రించాలన్న ప్రభుత్వ కార్యాచరణ నేటికీ కాగితాలకే పరిమితమైంది.

బయటకు వెళ్లాలంటే భయం భయం..

ప్రస్తుతం గ్రామాల్లో వృద్ధులు, చిన్నారులు కాలినడకన బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర పట్టుకోక తప్పడం లేదు. ముఖ్యంగా వాకింగ్ చేసేవారిలో వయోభేదం లేకుండా చేతికర్రను వెంటపెట్టుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఏ వీధిలో చూసినా వనారాలే దర్శనమివ్వడంతో గమ్యం చేరుకునే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయం భయంగా రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఇంటి ఆరుబయిట కూర్చోవాలంటే చేతిలో గుల్బర్ ఉండక తప్పడం లేదు. గతంలో కోతులను భయపెట్టేందుకు కొండముచ్చులను వీధుల్లో తిప్పేవారు కానీ నేడు వాటికి కూడా కోతులు భయపడటం లేదు. దీంతో ప్రజలు కోతులను రక్షించుకునేందుకు కర్ర, గుల్బర్‌లను ప్రస్తుతం ఆయుధంగా వినియోగించక తప్పడం లేదు.

ప్రజల గోస పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు..

గడిచిన ఆరేళ్లగా హరితహారం పేరుతో ఇబ్బడిముబ్బడిగా చెట్లు నాటుతున్నారు. అందులో ఒక శాతం పండ్ల మొక్కలను అడవుల్లో పెంచినా ఈ పరిస్థితి ఉండదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రెండేళ్లగా మంకీ ఫుడ్ కోర్టులను అడవులకు సమీపంలో ఏర్పాటు చేస్తున్నా వాటి పెంపకం ఎవరికీ పట్టకపోవడంతో ఆయా ప్రదేశాలు బోర్డులకే పరిమితమయ్యాయన్న ఆరోపణలు లేకపోలేదు. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం స్థానిక సంస్థలు కోతులను పట్టి దూరప్రాంతాల్లో వదిలేసే ప్రయత్నం చేశాయి. కానీ అవి సత్ఫలితాలనివ్వకపోవడంతో ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం మానేశారు. కనీసం ప్రత్యామ్నాయ చర్యలకు కూడా ఉపక్రమించడం లేదు. దీంతో సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కోతుల బెడద నియంత్రణపైనే..

మరో నెలరోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

బరిలో నిలిచే నేతలకు ఈసారి కోతుల నియంత్రణే ప్రజల నుంచి ప్రధాన డిమాండ్‌గా ఎదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో వానరాల చేష్టలను ప్రజలను అంతగా ఇబ్బంది పెడుతున్నాయి. వాటినుంచి రక్షణ పొందేందుకు ప్రత్యేకంగా నిధులు వెచ్చించాల్సి రావడం, ఉన్న వనరులను కోల్పోవడంతో ఇప్పటి నుంచే ఈ విధమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వానర సంతతి పెరిగింది..



గ్రామాల్లో కోతుల సంచారం అధికమైంది. వాటి వల్ల అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన ఎవరూ చేయడం లేదు. ఈసారి కోతులను నియత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్న నాయకులకే ఓటు వేస్తాం.

– వాంకుదోత్ విజయ్, విజయలక్ష్మీనగర్

ఎటు చూసినా కోతులే..



ఏ వీధిలో చూసినా కోతులు గుంపులే ఉన్నాయి. ఇంటి ఆవరణలో ఇష్టంగా పెంచుకునే పూలమొక్కలను పీకేస్తున్నాయి. కూరగాయల మొక్కలను, గృహోపకరణాలను ఛిద్రం చేస్తున్నాయి. ఇంతకాలం ఎవరికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. పరిష్కరిస్తామన్న నేతలకే మద్దతిస్తాం.

– వెంకటలక్ష్మి, తిలక్‌నగర్

బీసీకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

పాల్వంచ: కొత్తగూడెం కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యే టికెట్‌ను బీసీ అయిన ఎడవల్లి కృష్ణకే కేటాయించాలి కాంగ్రెస్ పార్టీ ఓబీసీ పట్టణ, మండల అధ్యక్షుడు చారి, కట్టా సోమయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మూడు జనరల్ సీట్లలో ఖమ్మం, పాలేరు ఓసీలకు కేటాయించిన దృష్ట్యా జిల్లాలో అత్యధిక బీసీలు ఉన్న కొత్తగూడెం నియోజకవర్గం టికెట్‌ను బీసీకే కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కో పార్లమెంట్ పరిధిలో రెండు బీసీ సీట్లు కేటాయిస్తానన్న మాటను నిలబెట్టుకోవాలన్నారు. నిరంతరం పార్టీ కోసం శ్రమిస్తున్న కృష్ణకు టికెట్ ఇవ్వాలని, 45 వేలకు పైగా పార్టీ సభ్యత్వాలు చేసినట్లు పేర్కొన్నారు. కొండం వెంకన్న, వన్నపురం శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, చంద్రగిరి సత్యనారాయణ, పోశెట్టి విజయ్, బద్ది కిశోర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఇల్లెందు: జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సమక్షంలో గురువారం మాజీ కౌన్సిలర్ బాదావత్ సరోజ, గోపగానీ రాజుతో సహా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కనకయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ హామీలు అమలు చేయలేని స్థితిలో ఉందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఇల్లెందులో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

ట్రాలీ డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డ ప్రమాదానికి కారణమైన ట్రాలీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కారెగట్టు గ్రామానికి చెందిన నల్లమాసు గోవర్ధన్, ఉమ దంపతులు ఈనెల 1న పాల్వంచ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సత్యనారాయణపురం గ్రామశివారులో ట్రాలీ డ్రైవర్ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. భార్యాభర్తలు కిందపడి గాయపడ్డారు. ప్రమాదానికి గురైన ఉమ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ట్రాలీ డ్రైవర్ రావుల ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

గుడుంబా పట్టివేత

పాల్వంచ: అక్రమంగా గుడుంబా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... గురువారం పట్టణంలోని అల్లూరి సెంటర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో కరకవాగుకు చెందిన బట్టు కుమార్ 18 లీటర్ల నాటు సారాను పాల్వంచ తరలిస్తుండగా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోద్ చేసినట్లు ఎస్ఐ బి.రాము తెలిపారు.

దేశ కీర్తిప్రతిష్టలు చాటిచెప్పాలి


జాతీయ జెండాలతో ట్రస్ట్ సభ్యులు, క్రీడాకారులు, విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: క్రీడాకారులు క్రీడా పోటీల్లో రాణించి దేశానికి కీర్తిప్రతిష్టలు తేవాలని జిల్లా గాంధీపథం ట్రస్ట్ చైర్మెన్ చింతల చెర్వు గెర్షోము అన్నారు. వన్డే ప్రపంచకప్–2023లో టీం ఇండియా విజయాన్ని కాంక్షిస్తూ గురువారం శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని క్రీడాకారులు, ట్రస్ట్ సభ్యులు జాతీయ జెండాతో ప్రదర్శన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో గెర్షోము మాట్లాడుతూ.. భారత క్రీడాకారులు ప్రపంచ విజేతలుగా నిలవాలని అకాంక్షించారు. దేశ పౌరులు, విద్యార్థులు, క్రీడల్లో రాణించి దేశానికి ప్రగతిని చాటిచెప్పాలన్నారు. రాబోయే రోజుల్లో అన్నిరంగాల్లో యువతను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు గుడివాడ రామలక్ష్మణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నాయకులను నిలదీయండి..


లొద్దిగండి చెరువును పరిశీలిస్తున్న కామేష్

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడెం నియోజకవర్గంలోని అనేక గిరిజన గ్రామాలకు నేటికీ తాగునీటి సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీరు అందించలేని పాలకులను వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. మండల పరిధి యానంబైల్, సత్యనారాయణపురం, ఉలవ్వనూరు, మొండికట్ట గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఉల్వనూరు వద్ద గల లొద్దిగండి చెరువును పూడ్చివేయడం వలన పంటభూములకు సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలైన చిరుతానిపాడు, పెద్దకలస, ఒంటిగుడిసె, రాళ్లచెలక గ్రామాల్లో తాగునీరు సౌకర్యం లేక గిరిజనులు మైళ్లదూరం నడిచి వెళ్లి వాగులు, వర్రెల నుంచి కలుషితమైన నీటిని తెచ్చుకుని తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఏళ్ల తరబడి గిరిజనులకు తాగునీటి సౌకర్యం కల్పించకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. బీఎస్పీ అభ్యర్థిని గెలిపిస్తే కబ్జాకు గురైన చెరువును పునరుద్ధరించి గిరిజన గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తానన్నారు. కె.వసుంధర, ప్రవీణ్‌కుమార్, బండి రమణి, కేతిని కుమారి, కోలా మల్లిక, రాజేశ్వరీ పాల్గొన్నారు.

బీఎల్ఓల గౌరవ వేతనం చెల్లించండి


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇల్లెందు: గడిచిన ఆరు నెలలుగా ఎన్నికల బీఎల్ఓ విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లకు చెల్లించాల్సిన గౌరవ వేతనం చెల్లించకుండా తాత్సారం చేయటం తగదని సీఐటీయూ తెలిపింది. గురువారం ఇల్లెందులో నియోజకవర్గ ఎన్నికల అధికారి కాశయ్యకు సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. బూత్ స్థాయిలో పని చేసే అంగన్‌వాడీలు కీలకంగా నూతన ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు లాంటి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వారికి ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లిస్తామని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత నబీ, మరియా, ఫాతిమా, సక్కుబాయి, శారద, నవమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): సంక్షేమ పథకాలు అమలులో నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో చతికలపడిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేసి బీఆర్ఎస్‌కు వీడ్కోలు పలకాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విద్యానగర్ కాలనీలో గురువారం జరిగిన మండల ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల సంక్షేమం కోసం కాకుండా అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు చోటామోటా నాయకులకు డబ్బులు సమకూర్చే పథకాలుగా మారాయని ఆరోపించారు. పట్టణ కార్యదర్శి వై.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక్కో బూత్‌కు 10 మందితో 10 బూత్‌లకు 100 మందితో బూత్ కమిటీలు ఏర్పాటు చేయటం జరిగిందని, మిత్రపక్షాల మద్దతుతో పోటీ చేయబోతున్న సీపీఐ గెలుపు కోసం బూత్ కమిటీ సభ్యులు పార్టీ కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మామిడిపల్లి బుచ్చిరాములు, కందుల జ్ఞానయ్య, కత్తెర రవీందర్, గడ్డం రాజయ్య, అనంతగిరి అంజయ్య, మోత్కూరి శంకర్, ప్రకాశ్, కిషోర్, మోహన్‌రావు, సత్యనారాయణ, ఐలయ్య, జ్యోతి, నాగమణి, లక్ష్మి, జడల గౌతమ్, కృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

ఆఖిరి పోరాటానికి సిద్ధం కండి..


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణ సాధనకై అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులో జరిగిన ఎమ్మార్పీఎస్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోవడానికి రాజకీయ పార్టీల వైఫల్యమే కారణమన్నారు. నవంబర్‌లో జరగనున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు మాదిగలందరూ రాజకీయాలకు అతీతంగా తరలివచ్చే విధంగా నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఈనెల 26న కొత్తగూడెంలో జరిగే రథయాత్రను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన మందా సురేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా కాకర్లకు చెందిన మిర్యాల కిరణ్, వెంగన్నపాలెంకు చెందిన నల్లగట్ల రాము, ఉపాధ్యక్షుడిగా పాపకొల్లుకు చెందిన గార్లపాటి గోపాల్, మండల అధికార ప్రతినిధిగా ఇడుపుల సాంబ, సహాయ కార్యదర్శిగా ఉబ్బపల్లి రాము ఎన్నికయ్యారు.

కేసీఆర్‌ను గద్దె దించుదాం..


ఇల్లెందు: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సుజాత

ఇల్లెందురూరల్: ప్రజాభీష్టానికి భిన్నంగా అసమర్థ పాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు ప్రజలంతా కలిసి రావాలని వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ లలితాపురం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేశారని, నేడు గులాబీ కండువా కప్పుకున్న వారికి మాత్రమే అందుతున్నాయని విమర్శించారు. రాజేష్, వీర, రాములు, సత్తిరెడ్డి, నరేష్, బాలాజీనాయక్, భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఇల్లెందు: పదేళ్లుగా పల్లెల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని వైఎస్ఆర్‌టీపీ నాయకురాలు బానోతు సుజాత నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి పట్టణంలోని 1వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్ షర్మిల నాయకత్వంలో తాము ఇల్లెందు నుంచి పోటీలో నిలువనున్నామని, అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మదార్‌బీ, అశోక్, రాములు, మేకల రాజేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీతోనే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని కొత్తగూడెం కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు రాయల శాంతయ్య అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్‌లో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ ఆదేశానుసారం గడపగడపకు కాంగ్రెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ అని వివరించారు. హామీలకే పరిమితమై, మాయమాటలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. సకినాల వెంకటేశ్వరావు, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, కొప్పుల రమేష్, జక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలవారి కోడలు ఉయ్యాలో..


వినోభానగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

జూలూరుపాడు: మండలంలో పలు గ్రామాల్లోని బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజు గురువారం మహిళలు, యువతులు తీరొక్క పూలతో అలిగిన బతుకమ్మను పేర్చారు. ఆచారం ప్రకారం ఈరోజు బతుకమ్మలకు నైవేద్యం సమర్పించ లేదు.

కలవారి కోడలు ఉయ్యాలో.. కనకమహాలక్ష్మీ ఉయ్యాలో.., బొడ్డెమ్మ బొడ్డెమ్మ బిడ్డెలెందరు..., పువ్వులన్నీ కలిసి పూదోటలోన..., అంటూ బతుకమ్మలను చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను ఆయా గ్రామాల సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఇల్లెందు: టేకులపల్లి మండలంలోని అన్ని గ్రాపంచాయతీల్లో గురువారం ఆరో రోజు అలిగిన బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి బస్టాండ్ సెంటర్, బొమ్మనపల్లి గ్రామాల్లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే హరిప్రియ పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు.

దుర్గామాతకు విశేష పూజలు


ఇల్లెందు: పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పలు గ్రామాలలో కొలువుదీరిన దుర్గామాతకు భక్తులు గురువారం పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో హోమం నిర్వహించారు. ప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. మండపాల వద్ద నృత్య కళాకారులు అమ్మవారి వేషధారణలతో భక్తి పారవశ్యాన్ని ప్రదర్శించారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంటౌన్: న్యూగొల్లగూడెం ప్రగతినగర్‌లో


ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో...



ఇల్లెందు: టేకులపల్లిలో లలితా త్రిపురసుందరీ దేవిగా, పాల్వంచ: గాంధీబొమ్మ వద్ద శాకంబరీదేవిగా...